# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 322
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
అక్టోబర్ 07, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net






8లో..

## ఘనంగా శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు


▫ పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వివరాలు2లో..



# అభివృద్ధికి.. అడ్డగీత!

- తమ చరిష్మా దెబ్బతింటుందన్న భయం
- దాతలకు నో చెబుతున్న లీడర్లు
- ఫండ్స్ లేక అస్తవ్యస్తంగా పంచాయతీలు
- అప్పులు చేసి నెట్టుకొస్తున్న కార్యదర్శులు




అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా మారింది ఆ ఊరి పరిస్థితి. అసలే నిధులు లేక నీరసించిపోతున్న గ్రామ పంచాయతీకి నిధులు అందించి అభివృద్ధి చేస్తానంటూ దాతలు ముందుకు వచ్చిన వారికి స్థానిక నాయకులే అడ్డుకట్ట వేయడం విడ్డూరంగా మారింది. గ్రామ సభలోనే అభివృద్ధి ప్రస్తావన తెచ్చినా అధికార పార్టీకి చెందిన నాయకులు ససేమిరా అనడంపై స్థానికులు మండిపడుతున్నారు. అమ్మ పెట్టదు.. అడుక్కు తిననివ్వదు అన్నట్లుగా మారింది హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని దమ్మన్నపేట గ్రామం పరిస్థితి. దాతలు సొంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చినా స్థానికంగా తమ చరిష్మా దెబ్బతింటుందన్న భయంతోనే అధికార పార్టీకి చెందిన నాయకులు అడ్డుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో యథాతథ స్థితి కొనసాగించేలా వ్యవహరిస్తున్నారు. - వరంగల్ వాయిస్, దామెర



## డీజీపీకి శ్రీధనమైసమ్మ చిత్రపటం అందజేత

తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా నియమితులైన శివధర్ రెడ్డిని వరంగల్ హెడ్ కానిస్టేబుల్, శివనగర్ శ్రీ ధన మైసమ్మ దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోట బాబన్న సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో డీజీపీని హెడ్ కానిస్టేబుల్ తోట బాబన్న కలుసుకుని శ్రీ ధన మైసమ్మ అమ్మవారి ఫొటోను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కృప, కటాక్ష వీక్షణాలు డీజీపీపై ఎల్లవేళలా ఉండాలని శ్రీ ధనమైసమ్మ అమ్మవారిని కోరుకున్నట్లు బాబన్న తెలిపారు.
– వరంగల్ వాయిస్, క్రైం




2లో..

## అందరి చూపు బీజేపీ వైపే

- స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్
- పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం : గంట రవికుమార్

## మావోయిస్టు నేత లొంగుబాటు

▫ వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్ ▫ రివార్డ్ చెక్ అందజేత




8లో..

# అభివృద్ధికి.. అడ్డగీత!

- తమ చరిష్మా దెబ్బతింటుందన్న భయం
- దాతలకు నో చెబుతున్న లీడర్లు
- ఫండ్స్ లేక అస్తవ్యస్తంగా పంచాయతీలు
- అప్పులు చేసి నెట్టుకొస్తున్న కార్యదర్శులు




**వరంగల్ వాయిస్, దామెర :** అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని దమ్మన్నపేట గ్రామం పరిస్థితి మారింది. ఆ ఊరి అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందించేందుకు దాతలు ముందుకొస్తున్నా అధికార పార్టీ నేతలు మోకాలడ్డు పెట్టడం వివాదాస్పదంగా మారింది. అభివృద్ధికి అడ్డుగీతలు గీస్తూ.. కాలం వెల్లదీయడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. గత రెండు సంవత్సరాలుగా కార్యదర్శుల పాలనలో సాగుతున్న గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. కనీస అవసరాలు తీర్చే పరిస్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

### ముందుకొచ్చిన దాతలు..

హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని దమ్మన్నపేట విలేజ్‌లో సీసీ కెమెరాలతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు తమ వంతు ఆర్థిక సహకారం అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. కానీ, సదరు వ్యక్తుల నుంచి ఎలాంటి సపోర్ట్ తీసుకోకూడదని, తమ ఎమ్మెల్యే ద్వారానే అభివృద్ధి పనులు జరుగుతాయంటూ కొందరు అధికార పార్టీ లీడర్లు దాతలను అడ్డుకోవడం గ్రామంలో పెద్ద దుమారమే లేపింది. గ్రామ పంచాయతీలో సమావేశమై మరీ దాతల సహకారాన్ని అడ్డుకుంటూ తమ పెత్తనాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు చలాయించడం వైరల్ గా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ దాతలు అభివృద్ధి పనులు చేస్తే తమ చరిష్మా దెబ్బతింటుందన్న భయంతోనే సదరు లీడర్లు అడ్డుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. ఊరి అభివృద్ధిని అడ్డుకునేందుకే అధికార పార్టీకి చెందిన లీడర్లు పనిచేస్తున్నారంటూ వాపోతున్నారు.

### ‘స్థానిక’ భయమా?

దాతల సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగితే.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము ఓటమి పాలవుతామనే భయం వారిలో నెలకొందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీపీలకు అభివృద్ధి నిధులు లేని దుస్థితి నెలకొంది. పారిశుధ్య నిర్వహణకు సైతం ఎలాంటి ఫండ్స్ లేవు. దీంతో చాలా మంది పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి మరీ కాలం వెల్లదీస్తున్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెట్టుకుని నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో దాతలు సదుద్దేశంతో అభివృద్ధికి సహకరిస్తామని ముందుకొస్తే.. అధికార పార్టీ లీడర్లు అడ్డుకోవడం వింతగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయం వెళ్లిందని, ఎమ్మెల్యేకు సదరు కాంగ్రెస్ లీడర్లు తలనొప్పిగా మారారని చెప్పుకొంటున్నారు. ఈ వ్యవహారంపై శాసన సభ్యులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసే పనులను నేతలు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు అభివృద్ధిని అడ్డుకుంటున్నట్టున్నారని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బీసీ బిల్లుకు బీజేపీనే అడ్డంకి

- సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్
- రిజర్వేషన్ వ్యతిరేకుల దిష్టి బొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు రెడ్డి జాగృతి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదని, ఇటీవల బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని సుప్రీంకోర్టులో గోపాల్ రెడ్డి వేసిన పిటీషన్ ను కోర్టు డిస్మిస్ చేయడమే ఇందుకు నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు బైరి రవి కృష్ణ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కల గుట్ట కాళోజీ జంక్షన్ లో బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులను ఖండిస్తూ రాస్తారోకో, నిరసన చేసి, రెడ్డి జగృతి సంస్థ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ లను అన్యాయంగా అడ్డుకోవాలని రెడ్డి జాగృతి చూస్తుంటే ప్రధాన పార్టీలైన ఆది నాయకులు ఎవరు స్పందించడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న విషయాలకు స్పందించే పార్టీల అధినేతలు రెడ్డి జాగృతి చేస్తున్న కుట్రలకు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ మొదటి నుంచి రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ, బీసీల విషయంలో ఢోఖాబాయి చేస్తుందన్నారు. అసెంబ్లీలో మద్దతు ఇచ్చినట్టే ఇచ్చి చట్టం ఆమోదం పొందే విషయంలో కనీసం ప్రయత్నించకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని ఆయన ఫైర్ అయ్యారు. బీజేపీకి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర గవర్నర్ ను ఒప్పించి ఒక్క రోజులోనే రిజర్వేషన్లు ఆమోదం పొందేలా చేయొచ్చని కానీ ఆ పార్టీ ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదంటే ఆ పార్టీకి బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం ఇష్టం లేదని ఆయన ఆరోపించారు. అగ్ర కులాల్లోని మేధావులు విజ్ఞతతో వ్యవహరించి బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించి స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. బీసీ రిజర్వేషన్లకు గండి కొట్టాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణను ప్రకటించి ముందుకు సాగుతామని వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజ దేవి, బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మడిశెట్టి అరుంధతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తడక సుమన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దొడ్డపల్లి రఘుపతి, కాసగాని అశోక్, దాడి రమేష్ యాదవ్, ఏరుకొండ పవన్ కుమార్, పులి మోహన్ గౌడ్, తంగళ్లపల్లి రమేష్, పెరుమాండ్ల అనిల్ గౌడ్ పంజల మధు, జ్ఞానేశ్వర్ గౌడ్, మరపల్లి సమ్మయ్య, శనిగరపు సుమన్, విక్రమ్, చాగంటి రమేష్, బక్కి అవినాష్, బస్వజు సురేష్, షాజహాన్, రాజేంద్ర ప్రసాద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.





# అందరి చూపు బీజేపీ వైపే

- స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్
- పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం : గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అందరి చూపు బీజేపీ వైపే ఉందని, స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్ లో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కంభంపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి పాటుపడేది ఒక్క బీజేపీ మాత్రమేనని ప్రజలు గహించారన్నారు. ఇప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసే ఆశావహుల నుంచి బీజేపీ అధిష్ఠానం దరఖాస్తులు స్వీకరించింది. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఒక్క సంకేమ పథకాన్ని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసిందన్నారు. ఏ మొహం పెట్టుకుని కాంగ్రెస్ స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడుగుతుందని నిలదీశారు. రైతులకు సన్న వడ్లకు బోనస్, చేయుత పెన్షన్ రూ.4 వేలకు పెంపు గాలికి వదిలేసిందని గంట రవికుమార్ ఆరోపించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని విమర్శించారు. అవినీతి, అక్రమాల్లో కల్వకుంట్ల కుటుంబం కూరుకుపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, గురుమూర్తి శివకుమార్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, వనం రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ తాళ్ల పెల్లి కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ సునీత, స్థానిక సంస్థల ఎన్నికల మండల ప్రభరీలు, కన్వీనర్లు, మండల అధ్యక్షులు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్థానిక ఎన్నికలపై సమీక్ష

- ముద్రణ యాజమాన్యంతో కలెక్టర్ సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ప్రింటింగ్, ముద్రణ యాజమాన్యంతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీపీఓ కల్పన పాల్గొని ప్రింటింగ్, ముద్రణపై అవగాహన కల్పించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని నిబంధనలను అనుసరించి ఎన్ని-బి లను సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు పూరించి ఇచ్చినట్లయితే వాటిని ముద్రించాలని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో వరంగల్ జిల్లాలోని వివిధ ప్రింటర్స్ యజమాన్యం పాల్గొన్నారు.

# ఓటు చోరీపై సంతకాల సేకరణ

◆ ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తూ రాహుల్ గాంధీ ప్రారంభించిన జాతీయ పోరాటానికి మద్దతుగా శాయంపేటలో సంతకాల సేకరణ కార్యక్రమం మొదలైంది. శాయంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్ఆర్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓటు చోరీతోనే మూడవసారి అధికారంలోకి వచ్చారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో బీజేపీ గెలిచిన ఎనిమిది ఎంపీ సీట్లలో సైతం అలాంటి మోసాలకు పాల్పడే విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో లక్షల ఓట్లను తొలగించి, బీజేపీ ఓటు చోరీకి పాల్పడటం వల్ల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. "ప్రతి గ్రామంలో కనీసం 100 సంతకాలు సేకరించాలి. దేశంలో ఓటు హక్కును, ప్రజాస్వామ్య విలువను కాపాడుకునేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలి" అని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వాల్మీకి మహర్షి చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. "రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి" అని కొనియాడారు. వాల్మీకి మహాకవి విరచిత రామాయణ ఇతిహాసం సదా అనుసరణీయం, ఆదర్శప్రాయం అని తెలిపారు. "కృషి ఉంటే మనుషులు రుషులవుతారు, మహాపురుషులవుతారు అన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు ధూళిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, మాజీ ఎంపీపీ భాషని చంద్రప్రకాష్, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైనాల కుమారస్వామి, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, మామిడాల సాంబయ్య, రేణిగుంట్ల సదయ్య, చింతల రైపాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వరదరాజు, మారేపల్లి కట్టయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'బాకీ' కార్డులపై బీఆర్ఎస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ భూపాలపల్లి బీఆర్ఎస్ నాయకత్వం వినూత్నంగా ప్రచారాన్ని చేపట్టింది. మంగళవారం, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు, శాయంపేటలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ శాయంపేట నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఈ బాకీ కార్డులను ప్రజలకు అందించి, కాంగ్రెస్ వైఫల్యాలను వివరించారు. ఈ కార్డులో ప్రస్తావించిన ప్రధాన హామీలు, వాటి అమలు తీరు ఇలా ఉన్నాయి. రైతులకు ఇస్తామన్న రైతుబంధు ఇవ్వలేదు, అలాగే రైతు రుణమాఫీ పూర్తిగా చేయలేదు. మహిళలకు నెలకు ఇస్తామన్న రూ. 2,500 ఆర్థిక సాయం అందించలేదు. వృద్ధులకు, వితంతువులకు రూ. 4,000, వికలాంగులకు రూ. 6,000 పెన్షన్లు పెంచుతామన్న హామీని నెరవేర్చలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 1 లక్షతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని ఆశపెట్టి, ఆ హామీని కూడా విస్మరించారు. "రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను, 'ఇదిగో మా బాకీ కార్డు, మాకు రావాల్సిన హామీల బాకీని ముందు చెల్లించండి' అంటూ ప్రజలు గట్టిగా నిలదీయాలి" అని బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ నేతలు మెతుకు తిరుపతిరెడ్డి, గంగుల మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచులు వల్పదాస్ చంద్రమౌళి, మారపల్లి నందం, శాయంపేట పాక్స్ మాజీ చైర్మన్ కుసుమ శరత్, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, యూత్ మండల అధ్యక్షుడు మారపల్లి మోహన్, గ్రామ పార్టీ అధ్యక్షులు గాజే రాజేందర్, దైనంపల్లి కరణ్ బాబు, రంగు మహేందర్, ప్రభాకర్ కర్ణాకర్, ముంజాల నాగరాజు, గంగుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ఓటు చోరీ ఆపాలి'



● బీజేపీ, ఈసీ తీరుపై
కాజీపేటలో సంతకాల సేకరణ

**వరంగల్ వాయిస్, కాజీపేట :** బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడటం, కేంద్రం కనుసన్నల్లో ఎన్నికల సంఘం పనిచేయడంపై కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలకు మద్దతుగా వరంగల్‌లో ఉద్యమం మొదలైంది. కాజీపేట చౌరస్తాలో మంగళవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఓటు చోరీని నిరసిస్తూ కేంద్రానికి పంపే విజ్ఞాపన పత్రంపై సంతకం చేసి తమ అభిప్రాయాన్ని బలంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గతంలో ఓట్లను అపహరించాయని తీవ్ర ఆరోపణలు చేశారు. "ఓటు హక్కు కోల్పోవడం అంటే సర్వం కోల్పోవడం" అని ఆయన అన్నారు. శాసనసభ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికలకు మధ్య ఓట్ల లెక్కింపులో వ్యత్యాసం ఉందని చెప్పారు. "ప్రజలందరూ మాకెందుకు అనుకుంటే, బీజేపీ ప్రభుత్వం ఈసీతో కలిసి మన ఓట్లను చోరీ చేస్తున్నది" అని గుర్తు చేశారు. గడిచిన చాలా కాలంగా రాహుల్ గాంధీ గారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాల్పడిన ఓట్ల చోరీపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ అణిచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేస్తూ, మతపరమైన రాజకీయాలకు పాల్పడుతూ, దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నా అధికారంలో కొనసాగాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ గారు చేస్తున్న ఓటు చోరీ పోరాటంలో కేంద్ర ప్రభుత్వం, ఈసీ సరైన సమాధానం చెప్పలేకపోతున్నాయని విమర్శించారు. "ఓటు చోరీలు, ఈసీ పాక్షిక వైఖరికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ స్వరం కలిపి పోరాటం చేయాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరగాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా బూత్ స్థాయి, డివిజన్ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి సంతకాలను సేకరించాలని నాయకులు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మోసం చేస్తున్న బీజేపీ తీరును ప్రజలు ఖండించాలని వారు కోరారు.

# దొంతి కాంతమ్మకు దొమ్మటి సాంబయ్య నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి తల్లి కాంతమ్మ మూడు రోజుల క్రితం మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య మంగళవారం ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు. వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, రాయపర్తి గ్రామ మాజీ సర్పంచ్ పర్నెం తిరుపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పెండ్యాల కొమురయ్య, వివేక్ రెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు. కాంతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ప్రార్థించారు.

# పరకాలలో బీఆర్ఎస్‌కు షాక్

## కాంగ్రెస్‌లో చేరిన కీలక నాయకులు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ గూటికి చేరారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు, వెల్లంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల ముఖ్య నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి గారి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేతాని ప్రభాకర్ రెడ్డి, పైండ్ల కృష్ణ ఉన్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెల్లంపల్లి గ్రామ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ నలుబాల కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి రవి, పరకాల మాజీ వైస్ ఎంపీపీ నేతాని ఆదిరెడ్డి, పాక్స్ డైరెక్టర్ రావుల విజేందర్ రెడ్డి, నేతాని మల్లారెడ్డి, పసుల రమేష్, నలుబాల పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కృషి చేస్తామని కొత్తగా చేరిన నాయకులు ఈ సందర్భంగా ప్రకటించారు.

# ఆలయానికి విరాళం అందజేత

**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రఖ్యాతిగాంచిన, కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో రాబోయే కార్తీక మాసంలో జరగనున్న ప్రత్యేక ప్రతిష్టాపన కార్యక్రమానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే గణపతి, శివలింగ, నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గణపురానికి చెందిన కీర్తిశేషులు ముప్పిడి దశరథ రామ్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కోడలు అయిన లలిత – సంతోష్ రెడ్డి దంపతులు, మనమరాలు స్పందిత రెడ్డి, మనమడు దశరథ రెడ్డి కలిసి రూ. 20,116 నగదును ఆలయ కమిటీకి అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ స్వీకరించారు. విరాళం అందించిన దాతలకు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్, భటిక స్వామి గౌడ్, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడు, ఉయ్యాల భిక్షపతి గౌడ్, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అనితా రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజ సేవలో దశాబ్దాలుగా నిస్వార్థంగా కృషి చేస్తున్న డాక్టర్ అనితా రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. మనం ఫౌండేషన్ (ఆంధ్రప్రదేశ్) వారిచే ప్రతిష్టాత్మక 'ఇంటర్నేషనల్ పీస్ అవార్డు – 2025' ఆమెకు లభించింది. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్‌గా డాక్టర్ అనితా రెడ్డి పలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా ఆమె చేసిన అత్యుత్తమ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అనాథ పిల్లలకు, దివ్యాంగులకు, మహిళలకు అమ్మ ప్రేమను అందిస్తూ వారి బాగోగులు చూస్తున్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు అనేక అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించారు.యువత చెడు మార్గాల బారిన పడకుండా, సన్మార్గంలో పయనించే విధంగా స్వయంగా కౌన్సిలింగ్ ఇస్తూ, శాంతి మార్గాన్ని బోధిస్తున్నారు. డాక్టర్ అనితా రెడ్డి అత్యుత్తమ సేవలను, నిస్వార్థ విధానాన్ని మెచ్చి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. డాక్టర్ అనితా రెడ్డి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు లభించినందుకు సంతోషంగా ఉందని, ఇది మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని సమాజహిత కార్యక్రమాలను, అవసరార్థులను ఆదుకునే కార్యక్రమాలను కొనసాగిస్తానని ఆమె తెలిపారు.

# దేవాలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో ఘనంగా జరిగిన శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా, అమ్మవారి సేవలో పాల్గొన్న సేవకులను, దాతలను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభధాని, నాగిళ్ల శంకర్ శర్మ ఆధ్వర్యంలో సేవకులకు, దాతలకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. అలాగే, నిస్వార్థంగా సేవ చేసిన సేవకులకు వేద పండితులచే వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా షణ్ముఖ అవధాని మాట్లాడుతూ అమ్మవారి సేవలో తరించిన భక్తులు, సేవకులు ఇదే విధంగా ఆలయానికి సహాయ సహకారాలు అందిస్తూ, దేవాలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. అమ్మవారికి, భక్తులకు మధ్య వేద పండితులు వారధిగా ఉంటారని, వారికి ఎల్లప్పుడూ ప్రతి భక్తుడు సేవలను అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు కనుకుంట్ల రవికుమార్, నీలారపు రాజ్ కుమార్, నల్లెల్ల వెంకటేశ్వర్లు, గిరి శరత్, తుమ్మేటి బుచ్చిరాజు, సదానందం, పోలు లక్ష్మణ్, గందె మధు, దొమ్మటి భాస్కర్, ఇల్లుటం లక్ష్మణ్, ఎస్. నరేందర్, తోట నాగరాజు, శ్రీనివాస్ తదితర భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి విరాళం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి మంగళవారం ఉదారంగా విరాళం అందింది. వంగాల సీతారాం రెడ్డి, వంగాల భగవాన్ రెడ్డిలు ఆలయ ట్రస్ట్ కమిటీకి రూ.20,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు మండల కేంద్రంలో ఆధ్యాత్మికత పెంపొందించే విధంగా ఆలయాలు నిర్మించడం శుభ పరిణామం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ సభ్యులు పొగాకుల కొమురయ్య, పొగాకుల రమేష్, బైగాన్ రమేష్, గుర్రం ప్రభాకర్, ఏరుకొండ పైడి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం

## ◆ రూ. 180 కోట్ల బకాయిలు విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, శివనగర్ :** తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పాఠశాలల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. దాదాపు 25,000 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తమ చదువులకు దూరం అయ్యే ప్రమాదం ఏర్పడిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ఖిలా వరంగల్ మండల కమిటీ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదాల్ల శరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం రూ. 180 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడంతో, బీఏఎస్ స్కీమ్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు లేఖలు రాసి, పాఠశాలలకు రావొద్దని స్పష్టం చేశాయని తెలిపారు. దీంతో 25 వేలకు పైగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఇళ్లకు పరిమితమయ్యే దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. "ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. అందాల పోటీలకు, పక్క రాష్ట్రాల్లో ప్రకటనలకు నిధులు ఉన్నాయి కానీ, పేద విద్యార్థుల చదువులకు నిధులు లేవా?" అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 238 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని, వీటిలో సుమారు 7 వేల మంది ఎస్టీ, 23 వేల మంది ఎస్సీ విద్యార్థులు చదువుతున్నారని శరత్ వివరించారు. ప్రభుత్వం ఈ స్కూల్స్‌కు డే స్కాలర్స్ విద్యార్థికి ఏటా రూ. 28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ. 42 వేలు ఫీజులు చెల్లించాలి. అయితే, 2023–24 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ ఫీజుల బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన ఈ రూ. 180 కోట్ల బకాయిల కారణంగానే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. తమ పిల్లలను స్కూల్స్‌కు పంపించాలా, వద్దా అని తెలియక పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారని శరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే విద్యాశాఖను ఉంచుకుని, కనీసం పేద విద్యార్థుల ఫీజులు కూడా చెల్లించలేకపోవడం దుర్మార్గం అని విమర్శించారు. పేద విద్యార్థుల చదువుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకుండా, వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు మొత్తం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివ, మండల నాయకులు భరత్, మదారపు శ్రేయస్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల ఫలితాలపై ఎంహెచ్ఎస్ ఆర్ బీ చైర్మన్‌తో చర్చలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** 732 ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి సంబంధించి తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ గోపి కాంత్ రెడ్డిని కలిశారు. అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. కోర్టు నుంచి ఎటువంటి స్టే ఆదేశాలు లేనందున, వెంటనే ఫలితాలను ప్రకటించాలని వారు చైర్మన్‌ను కోరారు. దాదాపు ఒక గంట సేపు ఈ అంశంపై చర్చలు జరిగాయి. అసోసియేషన్ నాయకుల వినతిపై చైర్మన్ గోపి కాంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) నుంచి పూర్తి స్థాయి నివేదిక అందగానే, ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి పంపి, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో పాటు కోర్టుకు సమాచారం సమర్పించి, ఆ వెంటనే ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల రిజల్ట్స్ ప్రకటిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ. వి శ్రీహరి పాల్గొన్నారు.

# కొమురం భీమ్‌కు ఘన నివాళులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆదివాసీల హక్కుల కోసం "జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాడిన పోరుబిడ్డ కొమురం భీమ్ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మంగళవారం కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఆదివాసులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడిన కొమురం భీమ్‌కు తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సముచిత గౌరవం దక్కిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొమురం భీమ్ పేరిట ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయడం జరిగింది. కొమురం భీమ్ జయంతులు, వర్ధంతులు అధికారికంగా నిర్వహించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కొమురం భీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీల, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడతామని బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులపై నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ చౌరస్తా :** పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న 'జినోసైడ్' (హత్యాకాండ) దురాక్రమణ దాడులను ఖండిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, కార్యకర్తలు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు మొదలై నేటికి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాస్ కీలక ప్రసంగం చేశారు. అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి 1948లో పాలస్తీనా భూభాగంపై కృత్రిమంగా ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పాటు చేశాయని శ్రీనివాస్ ఆరోపించారు. ఇజ్రాయిల్ పాలకులు పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమిస్తూ, ప్రజలను ఊచకోత కోస్తున్నారని, దీనికి అమెరికా, బ్రిటన్ అండ ఉందని విమర్శించారు. ప్రజాస్వామిక వాదులందరూ ఇజ్రాయిల్–అమెరికా ప్రభుత్వాల దుర్మార్గాన్ని ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మెడ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజా పాలన’కాదు.. ప్రజా వ్యతిరేక పాలన

◆ బీఆర్ఎస్ నాయకుల తీవ్ర విమర్శ




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. హనుమకొండ జిల్లా కార్యాలయంలో నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో 420 హామీలు, 6 గ్యారెంటీలు ఇచ్చింది. 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామన్నారు. ఓపికగా ఎదురుచూశాం. మహిళలకు సుమారు రూ.50,000 బాకీ ఉంది. వృద్ధులకు రూ.44,000, దివ్యాంగులకు రూ.44,000 బాకీ పడింది. కల్యాణ లక్ష్మికి తులం బంగారం ఇస్తామని మోసం చేశారని పెళ్లైన ఆడబిడ్డలు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు. ప్రజా పాలన అని చెప్పి ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నారు. హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అవమానకరంగా మాట్లాడుతున్నారు. మాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడం. అరెస్టులకు బెదరమని బీఆర్ఎస్ నేతలు అన్నారు. 10 ఏళ్లు తెలంగాణను అభివృద్ధి చేసింది మా ప్రభుత్వమే. వరంగల్ అభివృద్ధి కుంటుపడింది. కాంగ్రెస్, టీడీపీ హయాంలో భూములు, అజంజాహీ మిల్లు అమ్మేశారు. మేము టెక్స్‌టైల్స్ పార్క్, మడికొండలో ఐటీ పార్క్ తెచ్చాం. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దొంగే దొంగ అన్నట్టు మాట్లాడుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ మేము విడుదల చేసిన బాకీ కార్డులో తప్పు ఉందా? చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్స్‌కు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు

ఏసీపీ సత్యనారాయణ సూచనలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్‌లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా ఆటో డ్రైవర్ల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాశిబుగ్గలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, ఆటో డ్రైవర్లకు పలు ముఖ్య సూచనలు చేశారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని నొక్కి చెబుతూ, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు. ఆటో డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనం నడపరాదు. ఆటోకు తప్పనిసరిగా సరైన నెంబర్ ప్లేట్ ఉండాలి. ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లు వాడకూడదు. డ్యూటీలో ఉన్నప్పుడు విధిగా యూనిఫామ్ ధరించాలి. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపకూడదు. ట్రాఫిక్ నియమాలు సరిగా పాటించాలి. వేగంగా (ఓవర్ స్పీడ్) ఆటో నడపరాదు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి. రాంగ్ సైడ్ డ్రైవ్ చేయకూడదు, అలాగే ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించుకోకూడదు (ఓవర్‌లోడ్) అని పలు నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరు సుజాత, ఇతర సిబ్బందితో పాటు దాదాపు 300 మంది ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

## రైతుకు న్యాయం

మూడేళ్ల తర్వాత బీమా సొమ్ము మంజూరు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీమా నిబంధనల కారణంగా రైతు బీమా సొమ్మును కోల్పోయిన ఓ రైతు కుటుంబానికి మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో న్యాయం జరిగింది. ఈ విజయం వెనుక హైదరాబాద్ రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఇచ్చిన తీర్పు కీలకం కాగా, యువ న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్ పోరాటం అభినందనీయం. జనగామ జిల్లా చిల్పూరు మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన రైతు కొలిపాక యాదమ్మ 2022 నవంబరు 5న మరణించారు. యాదమ్మ మరణించే నాటికి ఆమె వయస్సు 60 సంవత్సరాలు దాటిందని పేర్కొంటూ, రైతు బీమా పథకం కింద రావలసిన రూ.5 లక్షల సొమ్మును అధికారులు నిరాకరించారు. దీనికి కారణం దరఖాస్తులో యాదమ్మ పుట్టిన తేదీని ఆధార్ కార్డు ప్రకారం 1975గా నమోదు చేశారు. కానీ రైతు బీమా పాలసీ బాండ్‌లో ఆమె పుట్టిన తేదీ 1-1-1963గా తప్పుగా నమోదై ఉంది.యాదమ్మ కుటుంబం న్యాయవాది రాచకొండ ప్రవీణ్‌కుమార్‌ను ఆశ్రయించింది. ప్రవీణ్ కుమార్ 2023 ఫిబ్రవరిలో వరంగల్ జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేశారు. దీనిపై ఆగస్టు 2023లో ఫోరం తీర్పునిస్తూ, రైతు పుట్టిన తేదీని ఆధార్ కార్డు ప్రకారం మాత్రమే పరిగణించాలని ఆదేశించింది. అయితే, బీమా సొమ్ము మొత్తం కాకుండా రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని వెల్లడించింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని ప్రవీణ్ కుమార్, ఈ కేసును రాష్ట్ర వినియోగదారుల ఫోరం, హైదరాబాద్‌లో సవాలు చేశారు. అన్ని వివరాలు పరిశీలించిన రాష్ట్ర ఫోరం... బాధిత రైతు కుటుంబానికి బీమా సొమ్ము రూ. 5 లక్షలు పూర్తిగా చెల్లించాలని గత నెల 29న చారిత్రక తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన న్యాయవాది ప్రవీణ్ కుమార్, తెలంగాణలో బీమా నిబంధనల కారణంగా సొమ్ము కోల్పోయిన ఎంతో మంది బాధిత రైతులకు ఈ తీర్పు వర్తిస్తుందని, వారు కూడా కోర్టును సంప్రదించి తమ బీమా సొమ్మును పొందే అవకాశం ఉందని తెలిపారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మామునూరులోని నాలుగో బెటాలియన్ ఆవరణలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ శ్రీ డి. శివ ప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో పౌర్ణమినాడు మహర్షి వాల్మీకి జయంతిని జరుపుకుంటామని తెలిపారు. సాహిత్యానికి ఆయన చేసిన కృషిని, ధర్మంపై ఆయన బోధనలను గౌరవించడానికి ఈ వేడుకలు జరుపుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. మహర్షి వాల్మీకిని ఆదికవి (మొదటి కవి) అని కూడా పిలుస్తారు. ఆయన ప్రాచీన భారతదేశంలోని రెండు ప్రధాన సంస్కృత ఇతిహాసాలలో ఒకటైన రామాయణాన్ని రచించారు. వాల్మీకి మహర్షి ఒకప్పుడు దోపిడీదారుడిగా ఉండి, ఋషి నారదుడిని కలిసిన తర్వాత లోతైన ఆధ్యాత్మిక పరివర్తనకు గురై, గౌరవనీయమైన ఋషిగా, రామాయణ రచయితగా మారారని గుర్తు చేశారు. కృషి ఉంటే ఎవరైనా మహర్షులు కాగలరనేందుకు ఆయన జీవితం నిదర్శనం. ఆయన



రచించిన రామాయణంలోనే దసరా, దీపావళి పండుగల ప్రస్తావన ఉందని వివరించారు. ఇంతటి సుగుణాలను కలిగి ఉన్న వాల్మీకి మహర్షిని నిరంతరం స్మరిస్తూ, ఆయన బోధనలను నిత్యం పాటిస్తూ, ధర్మాన్ని ఆచరిస్తూ ఉండాలని కమాండెంట్ సిబ్బందిని కోరారు. ఈ జయంతి వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్‌లు పి. శ్రీనివాసరావు, వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, విజయ్, కార్తీక్, రవి, రాజ్ కుమార్ తో పాటు రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పోలీస్ పాలన

రైతు ధర్నాలో కేసుల నమోదుపై దాస్యం ఫైర్



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** రైతుల సమస్యలపై పోరాటం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతుల కోసం ధర్నా చేసినందుకు హనుమకొండ పోలీసులు తమపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గత నెలలో యూరియా కొరతకు నిరసనగా హనుమకొండ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన నోటీసులు అందించేందుకు ఎస్ఐ సదానందం మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ "నా 40 ఏండ్ల రాజకీయ చరిత్రలో ఏనాడూ ధర్నా చేస్తే నాన్-బెయిలబుల్ కేసు కాలేదు. రైతుల పక్షాన పోరాడితే కేసులు పెట్టడం ఏంటి?" అని ఆయన ప్రశ్నించారు. "ప్రెస్‌మీట్ పెట్టినా... ధర్నా చేసినా... పార్టీ ఆఫీసుకొచ్చినా... పోలీస్‌ల చక్రబంధమే" అని కాంగ్రెస్ పాలన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయడం లేదని, ఇది ‘ప్రజాపాలన కాదు, పోలీస్ పాలన’ అని విమర్శించారు.

## సీజేఐపై దాడిని ఖండించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** సుప్రీంకోర్టులో కేసు విచారణ సందర్భంగా జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని పద్మశాలి సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ చర్యను భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాలని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య అన్నారు. సాంబయ్య మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అగ్ర వర్ణాల వారు న్యాయమూర్తులను బెదిరించడం, ప్రభావితం చేయడం భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. సుప్రీంకోర్టులో దాడికి పాల్పడ్డ న్యాయవాది రాకేష్ కిషోర్‌ను అరెస్టు చేసి, మూడు గంటల్లో విడుదల చేయడం హేయమైన చర్యని విమర్శించారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తిని తక్షణమే ఉరితీయాలని (లేదా కఠినంగా శిక్షించాలని) ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతల భాస్కర్, వైనాల సాంబయ్య, మొగ్గం సుమన్, అంకేశ్వర ఐలయ్య, అరికెళ్ల దేవయ్య, ప్రభాకర్, పైడి తదితరులు పాల్గొన్నారు.

## దళిత మంత్రిని ‘దున్నపోతు’ అనడం సిగ్గుచేటు

మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** దళిత సామాజిక వర్గానికి చెందిన సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. శాయంపేటలో జరిగిన మీడియా సమావేశంలో ఏకు శంకర్ మాదిగ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మీడియా సమావేశంలో ఆలస్యంగా వచ్చిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని ఉద్దేశించి, పొన్నం ప్రభాకర్ "దున్నపోతు" అంటూ హీనంగా మాట్లాడి అవమానించారని తెలిపారు. పొన్నం ప్రభాకర్ గెలుపుకు హుస్నాబాద్‌లో దళితులే ఎక్కువ కారణమయ్యారని గుర్తు చేశారు. మంత్రి అయిన తర్వాత ఆయన బీసీ బిడ్డలా కాకుండా, అగ్రకుల అహంకార ధోరణితో మాట్లాడటం సిగ్గుచేటు అని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏకు శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. లేదంటే, రాబోయే రోజుల్లో పొన్నం ప్రభాకర్ ఎక్కడ తిరిగినా దళిత సమాజం అడ్డుకుంటుందని, హుస్నాబాద్ నియోజకవర్గంలో కూడా ఆయన పర్యటనలను ఎమ్మార్పీఎస్ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు.

# సీఐ విశ్వేశ్వర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, గీసుగొండ:** వరంగల్ జిల్లా గీసుగొండ మండల పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విశ్వేశ్వర్ ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ల్యాదల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకుల బృందం సీఐ విశ్వేశ్వర్ ని కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు శాఖ, ప్రజల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని, శాంతి భద్రతల విషయంలో పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడేపు రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్, సొసైటీ డైరెక్టర్ లెంకలపెల్లి స్వామి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాదారపు మల్లిఖార్జున్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రంజిత్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు బందెల రేణుక, డివిజన్ నాయకులు రామన్న, కందుల రవికిరణ్, గబ్బెట శ్రీనివాస్, బండారి సదానందం, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘దోఖా–బాకీ కార్డులు’ రాజకీయ డ్రామా

## నిజమైన అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేయడానికి “దోఖా కార్డ్”, “బాకీ కార్డ్” పేరుతో కొత్త రాజకీయ డ్రామాలకు తెరతీశాయని బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ శాయంపేట మండల శాఖ అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఈ మేరకు మంగళవారం శాయంపేటలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటూ మోసం చేస్తోందన్నారు. గతంలో ఇచ్చిన రుణమాఫీ, గృహ నిర్మాణం, కల్యాణ లక్ష్మి, ఉచిత విద్యుత్ వంటి వాగ్దానాల్లో ఒక్కటీ నిలబెట్టుకోలేకపోయింది. వారి లక్ష్యం అభివృద్ధి కాదు, కేవలం ఓట్లు పొందే ప్రలోభాలేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. “బాకీ కార్డ్” పేరుతో మరోసారి ప్రజల నమ్మకాన్ని దోచుకోవాలని చూస్తోందని, వారి పాలన అవినీతి, అసమానతలకు దారి తీసిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు భూతం తిరుపతి, మామిడి విజయ్, జిల్లా సీనియర్ నాయకులు బాసాని విద్యాసాగర్, వనం దేవరాజ్, గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీజేఐపై దాడి హేయనీయం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై రాకేష్ కిషోర్ అనే వ్యక్తి బూటు విసిరి దాడి చేయడాన్ని తొర్రూర్ బార్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యను అత్యంత హేయనీయమని పేర్కొంటూ, రాజ్యాంగ విలువలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దాడికి నిరసనగా, తొర్రూర్ బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తమ విధులను బహిష్కరించారు. కోర్టు ప్రాంగణం నుండి టీచర్స్ కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన ఈ దాడిని తాము భారత రాజ్యాంగంపై దాడిగా పరిగణిస్తున్నామని తెలిపారు. నిందితుడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి, నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్కే ఘనపురం, జనరల్ సెక్రటరీ అశోక్ మైలపాక, ట్రెసరర్ మాదగాని నాగరాజు తో పాటు ప్రవీణ్ రాజు, రఘురాంరెడ్డి, బానోత్ లాలు సహా పలువురు న్యాయవాదులు, క్లర్కులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

## ◆ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో పెద్దవంగర మండల ముఖ్య నాయకులతో కలిసి ఆమె స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి. ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ముఖ్యంగా సంక్షేమ పథకాలను వివరంగా వివరించాలన్నారు. “ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం ద్వారా అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలి. మన లక్ష్యం కేవలం విజయం కాదు, ప్రజల్లో పార్టీకి మరింత బలం చేకూర్చడం కూడా,” అని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాయకులతో పార్టీ తీరు, స్థానిక అభివృద్ధి అంశాలపై చర్చించి, ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను బలోపేతం





చేయాలని సూచించారు. సమావేశంలో పెద్దవంగర మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పలు గ్రామ మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, యువనాయకులు, మహిళా నాయకులు ఉత్సాహభరిత వాతావరణంలో పాల్గొన్నారు. మీరు అడిగిన వార్తా కథనాన్ని కాంగ్రెస్ పార్టీ కోణం నుండి, చేరికల ఉద్దేశం మరియు ఎమ్మెల్యే సందేశంపై దృష్టి పెడుతూ, స్పష్టంగా తిరిగి రాశాను.

### కాంగ్రెస్ లో భారీ చేరికలు..

పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికల పరంపర ఉధృతంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో మంగళవారం దేవరుప్పుల, రాయపర్తి మండలాలకు చెందిన బీఆర్ఎస్ కీలక నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పలు మండలాల నుంచి బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 30 కుటుంబాలు తమ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నాయి. దేవరుప్పుల మండలం (లక్ష్మణ్ తాండా) నుంచి బానోతు సుజాత, బానోత్ శోభ, భీమిలి, బికోజి తదితరులు, రాయపర్తి మండలం (మహబూబ్‌నగర్ గ్రామం) నుంచి బిరామనేని అశోక్, బొమ్మిడినేని రమేష్, శ్రీకాంత్, శ్రీలత, రజిని, శ్యామల తదితరులు చేరగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# సీజేఐపై దాడి రాజ్యాంగంపై దాడి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ డీవైఎఫ్ఐ నాయకులు హనుమకొండ జిల్లాలోని కుమార్ పల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి మాట్లాడారు. న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసిరి దాడికి యత్నించడం దేశంలో నెలకొన్న దుస్థితిని తెలియజేస్తోందని తిరుపతి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యను ప్రజాతంత్ర, లౌకిక వాదులు తీవ్రంగా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, ఒక పథకం ప్రకారం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానం అని ఆయన పేర్కొన్నారు.“సనాతన ధర్మాన్ని మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకొని ప్రచారం చేస్తున్న తరుణంలో, జస్టిస్ గవాయ్‌పై దాడుల వంటివే సనాతన ధర్మమా?” అని బీజేపీని ప్రశ్నించారు. వెంటనే దాడి చేసిన దుండగుడిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని తిరుపతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జి.నాగరాజు, జి.అఖిల్, కే.మహేందర్, కె.గణేష్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నేరాల అదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వరంగల్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. హనుమకొండలోని రోజరి హైస్కూల్‌లో దాదాపు 100 మంది విద్యార్థినులకు మహిళా భద్రత, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ నేరాలు అదుపు చేయడంలో జాగ్రత్తతో మెలగడం అత్యంత ముఖ్యమన్నారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూర్యనారాయణ కోరారు. సైబర్ నేరాల టోల్ ఫ్రీ–1930, సీపీ వాట్సాప్ నంబర్: 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్: 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్: 8712685270లను సంప్రదించవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు చాలా గోప్యంగా ఉంచి, నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోజరి హైస్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, ఉమెన్ కానిస్టేబుల్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఈ–పాస్ ద్వారానే ఎరువులు

## ◆ డీలర్లకు ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి ఆదేశం

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో రైతులకు ఈ–పాస్ యంత్రం ద్వారానే ఎరువులను విక్రయించాలని పరకాల ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి ఎరువుల దుకాణాల యజమానులకు ఆదేశించారు. మంగళవారం ఆయన దామెర మండలంలోని ఊరుగొండలో గల ఎరువుల దుకాణాలను పర్యవేక్షించారు. ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి ఎరువులు, పురుగుమందుల డీలర్లకు కింది ముఖ్య సూచనలు చేశారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి ఎరువులు, మందులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలి. దుకాణం ఆవరణలో స్టాక్ బోర్డును ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను తెలపాలి. కొనుగోలు చేసిన మరియు విక్రయించిన స్టాకు వివరాలను వెంటనే స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఈ నియమాలను పాటించని పక్షంలో చట్టపరమైన చర్యలు



తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాకేష్, ఏఈఓ రామకృష్ణ, మరియు ఫర్టిలైజర్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
మంగళవారం 07 అక్టోబర్ 2025
7

# అప్పుడే ఓటీటీలోకి ఇడ్లీ కొట్టు




తమిళ స్టార్ హీరో ధనుష్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా తెలుగులో ఇడ్లీ కొట్టు. అక్టోబర్ 1న దసరా కానుకగా విడుదలైన ఈ సినిమా మొదటి షో నుంచే థియేటర్లలో మంచి హిట్ టాక్ దక్కించుకుంది. విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణ ? రెండిరటిని సొంతం చేసుకుంది. ఇక తాజాగా ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు టాక్ నడుస్తోంది.రిలీజ్ అయిన నెల రోజుల్లోపే డిజిటల్ ప్రీమియర్‌కి వస్తుందన్న వార్త ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం, ఇడ్లీ కడై ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకొగా. ఈ సినిమా అక్టోబర్ 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని టాక్ వినిపిస్తోంది. అంటే, థియేటర్లలో ఇంకా రన్ అవుతున్నప్పుడే డిజిటల్ ఎ□`లాట్‌ఫార్మ్‌కి రావడం పెద్ద సర్ప్రైజ్. ఇక ధనుష్ కేవలం హీరోగానే కాకుండా రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా కూడా పనిచేయడం ఈ మూవీకి మరింత హైప్ తెచ్చింది. అరుణ్ విజయ్, సత్యరాజ్, సముద్రఖని, నిత్యా మీనన్, షాలిని పాండే వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ కథలో ధనుష్ ‘మురుగన్‘ పాత్రలో కనిపిస్తాడు. కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడం, ఆధునిక ఆశయాలను నెరవేర్చుకోవడం మధ్య కన్‌ఫ్యూజ్ అయ్యే యువకుడి ఎమోషనల్ జర్నీని ఈ సినిమా చూపిస్తుంది. చివరికి తన మూలాలను తిరిగి చేరుకునే మురుగన్ పాత్రలో ధనుష్ నేచురల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తిరుచిత్రంబలం తర్వాత నిత్యా మీనన్‌తో ఆయన జోడీ ఈ సినిమాకు మరో హైలైట్. జివి ప్రకాష్ మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. మొత్తంగా, థియేటర్లలో బజ్ క్రియేట్ చేసిన ఇడ్లీ కడై ఇప్పుడు ఓటీటీ లోనూ అదే మంత్రాన్ని కొనసాగించనుంది.



# జ్యువెలరీ యాడ్ ఫిల్మ్‌లో బాలయ్య కూతురు తేజశ్విని

టాలీవుడ్ లో స్టార్ హీరోల కొడుకులు హీరోలుగా వెండితెరపై ఎంట్రీ ఇస్తారు కానీ వారి డాటర్స్ మాత్రం స్క్రీన్ పై కనిపించడం అరుదు. గతంలో సూపర్ స్టార్ కృష్ణ కూతరు మంజుల హీరోయిన్ గా బాలయ్య సరసన చేయబోతోంది అంటే ఫ్యాన్స్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అందుకే చాలా వరకు హీరోల డాటర్స్ స్క్రీన్ పై కనిపించేందుకు ఇష్టపడరు. ప్రస్తుతం స్టార్ హీరోలైన చిరు, బాలయ్య డాటర్స్ నిర్మాతలుగా రాణిస్తున్నారు. వెంకీ డాటర్స్ సినిమాలు దూరంగా ఇతర రంగాలలో రాణిస్తున్నారు.

కానీ బాలయ్య చిన్న కూతురు నందమూరి తేజశ్వని ఇప్పుడు కెమెరా ముందుకు వస్తోంది. ప్రస్తుతం అఖండ 2 కు సహా నిర్మాతగా కూడా తేజు వ్యవహరిస్తోంది. ఇన్నిరోజులు తండ్రి బాలయ్య సినిమాల వ్యవహారాలు చూస్తూ వస్తున్న తేజు ఇప్పుడు కెమెరా ముందు నటించింది. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్‌కు నందమూరి తేజస్విని బ్రాండ్ అంబాసిడర్ గా వ్యహరిస్తోంది. ఇటీవలే హైదరాబాద్‌లో ఈ యాడ్ షూట్ కూడా ఫినిష్ చేసారు తేజస్విని. ఈ జ్యువెలరీ బ్రాండ్ మరియు ఇతర ప్రమోషన్స్ గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిరచనున్నారు.






# కార్తికేయ తొలిహీరో.. అల్లరి నరేశ్

మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన 'కార్తికేయ' చిత్రం కోసం తొలుత అల్లరి నరేశ్‌ను అడిగారట. ఆయనను ఉద్దేశించి కథను సిద్ధం చేసుకున్నట్లు చందు మొండేటి తెలిపారు. ఈ సినిమా నిఖిల్ చేయగా టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేసింది. హీరో నిఖిల్ కెరీర్‌లో బి□`గగెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సుమారు రూ.6 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లు వసూళ్లు సాధించింది. ముందుగా ఈ కథను దర్శకుడు చందూ మొండేటి.. నరేశ్‌కే వినిపించారు. స్టోరీ తనకు బాగా నచ్చినా ఒక్క కారణంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించలేదు. అదేంటంటే.. సుబ్రహ్మణ్యపురం అనే గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పాములు ఎక్కువగా కనిపించిన సంగతి తెలిసిందే. ఆ సన్నివేశాలే ఈ సినిమాకి కీలకం. వ్యక్తిగతంగా తనకు పాములంటే భయపడడం వల్ల నరేశ్ ఆ సినిమాని తిరస్కరించారట. ఓ ఇంటర్వ్యూలో ఆయనే ఈ వివరాలు పంచుకున్నారు. బయటేకాదు సినిమాల్లో కనిపించే పాముల దృశ్యాలను చూసినా ఇప్పటికీ భయపడతానన్నారు. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'కార్తికేయ 2' రూపొందింది. 'కార్తికేయ' పార్ట్ 2 నిఖిల్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఒకవేళ అల్లరి నరేశ్ 'కార్తికేయ'లో నటించి ఉంటే అప్పటి నుంచే ఆయన సీరియస్ కథల్లో కనిపించేవారేమో. సీరియస్ లుక్‌లో ప్రేక్షకులు తనని అంగీకరిస్తారా, లేదా? అనే సందేహానికి 'మహర్షి' చిత్రంలో పోషించిన రవిశంకర్ పాత్ర జవాబుగా నిలిచిందని, ఆ క్యారెక్టరే పవర్‌ఫుల్ స్టోరీల్లో నటించేందుకు ధైర్యాన్నిచ్చిందని నరేశ్ మరో సందర్భంలోనూ పంచుకున్నారు. వరుసగా యాక్షన్ తరహా స్జబెక్టులకే పరిమితం కాకుండా కామెడీ సినిమాలూ చేస్తుంటానని చెప్పారు.






# కాంతారా మూవీకి క్రికెటర్ రాహుల్ ఫిదా



రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు. కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం అని తెలిపారు.



# మావోయిస్టు నేత లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- రివార్డ్ చెక్ అందజేత



**వరంగల్ వాయిస్, క్రైం :** నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మంద రూబెన్ అలియాస్ కన్నన్న అలియాస్ మంగన్న అలియాస్ సురేష్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటుకు సంబంధించిన పూర్తి వివరాలను సీపీ వివరించారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్ఈసీలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఒకప్పటి ఆర్ఈసీ పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు మేరకు మావోయిస్టు పార్టీలో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981 నుంచి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వంలో దళ సభ్యుడిగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసారు. 1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ కు ఏరియా కమిటీ సభ్యుడి బాధ్యతలు అప్పగించారు. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగుడెంకు వెళుతున్న సమయంలో చత్తీస్ గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలుకు తరలించగా, ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుంచి తప్పించుకున్నారు. జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీలో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేశాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమేతో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం ఉంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు.

ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిచేవాడు. 67 సంవత్సరాల రూబెన్ అనారోగ్యంతో బాధపడుతూ ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపోవడం, ముఖ్యంగా మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పురావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోయారని సీపీ తెలిపారు. దీంతో ఆయనపై ఉన్న రూ.8 లక్షల రివార్డ్ చెక్కును సీపీ రూబెన్ కు అందజేశారు.





## 29 వ స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం

- దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహణ
- హాజరైన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీడబ్ల్యుఎస్ సీసీఎల్) చైర్మన్ డాక్టర్ టీకే శ్రీదేవి అధ్యక్షతన 29 వ స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం మంగళవారం హైదరాబాద్ నుంచి వర్చువల్ గా నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీడబ్ల్యుఎస్ సీసీఎల్ చైర్మన్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులకు సంబంధించి బోర్డులో అప్రూవల్ తీసుకున్న ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు అనుమతులు పొందడం జరిగిందని పూర్తి ఐన ప్రాజెక్టుల బిల్లుల మంజూరు కోసం అక్టోబర్ వరకు గడువు పొడిగించడం జరిగిందని, కొనసాగుతున్న ప్రాజెక్ట్ పనులను డిసెంబర్ లోగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా చైర్మెన్ సూచించారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ గా స్మార్ట్ సిటీ బోర్డు సభ్యులు ఈఎన్ సీ భాస్కర్ రెడ్డి ,టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, సీడీఎంఏ డైరెక్టర్ ఫణి కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, మడికొండ :** మడికొండలో మంగళవారం నిర్వహించిన మహాకవి వాల్మీకి మహర్షి జయంతి – స్వర్ణోత్సవ వేడుకలకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం కావ్య మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి మన సంస్కృతి, సాహిత్యానికి అజరామరమైన మార్గదర్శి అన్నారు. ఆయన రచించిన రామాయణం భారతీయ జీవన విధానానికి, నైతికతకు ప్రతిబింబం అని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి చూపిన సద్గుణాలను ఆచరించాలన్నారు. మన సమాజ అభివృద్ధి, సాంస్కృతిక విలువల పరిరక్షణలో వాల్మీకి మహర్షి ఉపదేశాలు యుగయుగాలకూ మార్గదర్శకం అని పేర్కొన్నారు. అలాంటి మహర్షి జయంతి స్వర్ణోత్సవం మనందరికీ గర్వకారణం అన్నారు. వాల్మీకి కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘ ప్రతినిధులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### వరంగల్ కలెక్టరేట్ లో..

మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించవచ్చు అనడానికి వాల్మీకి మహర్షి జీవితం నిదర్శనమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్లో మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా విష్ణు సహస్ర నామ పారాయణం

**గోవిందాద్రి గుట్టపై వేడుక**

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** చరిత్రకు నిలయమై వరంగల్ నగర నడి మధ్యన గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీసమేతుండైన శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. గోవిందాద్రి గోశాల వ్యవస్థాపక అధ్యక్షులు గర్నెపల్లి మాధవి–సుధాకర్ ఆధ్వర్యంలో వారి సహచర భక్త బృందంచే గోవిందాద్రి గుట్టపైన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి పర్యవేక్షణలో వందలాదిగా భక్తులు విచ్చేసి గోవిందరాజస్వామి దివ్య సన్నిధానం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని పఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణ స్వామి, వరయోగుల ప్రసాద్ స్వామి, వరయోగుల మురళీకృష్ణ స్వామితోపాటు విష్ణు సహస్రనామ భక్తబృందం గర్నెపెల్లి సుధాకర్, మాధవి, లక్ష్మి, లావణ్య, దీపిక, రాజేశ్వరి, శోభ, భక్తులు రవీందర్, బుచ్చన్న, రామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి మంగళ శాసనం చేసి తీర్థ శతగోప ప్రసాదములను అందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com